# రేపటి నుంచి 'తరుణి' ఫెయిర్



- మధురానగర్ మెట్రో స్టేషన్‌లో మినీ ఎగ్జిబిషన్
- రెండు నెలలు కొనసాగనుండగా ప్రవేశం ఉచితం
- పల్లె జీవనం, సంస్కృతితో 150 స్టాల్స్ ఏర్పాటు
- మీడియా సమావేశంలో మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి

**హైదరాబాద్, వెలుగు :** మెట్రో ప్రాజెక్ట్ ను పట్టాలెక్కించటం కోసం ఎంతో కష్టపడ్డామని మెట్రో రైలు ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రాజెక్ట్ లో భాగంగా ఎదురైన అడ్డంకులు దాటుకుంటూ ముందుకు వెళ్తూ నగర వాసుల మెట్రో కలను నిజం చేశామని పేర్కొన్నారు. ప్రాజెక్ట్ లో భాగంగా దాదాపు 370 కేసులు వేయడంతో కొంత ఆలస్యమైందని, 360 కేసుల్లో కోర్టులో విజయం సాధించామని చెప్పారు. మెట్రో ప్రాజెక్ట్ ను ప్రయాణికుల సౌకర్యం కోసమే కాకుండా ప్రపంచంలో ఏ మెట్రో స్టేషన్ లో లేని విధంగా సామాజిక బాధ్యతగా కూడా పలు కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఇందులో భాగంగానే మహిళ సాధికారత కోసం మధురానగర్ మెట్రో స్టేషన్ ను తరుణి మధురానగర్ స్టేషన్ గా మార్చినట్లు చెప్పారు. శనివారం సాయంత్రం తరుణి మధురానగర్ స్టేషన్ లో తరుణి ఫెయిర్ పేరుతో మినీ నుమాయిష్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా తరుణి మధురానగర్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వివరాలు వెల్లడించారు.

ప్రపంచంలోనే తొలి మహిళ మెట్రో స్టేషన్ తరుణి మధురానగర్ మెట్రో స్టేషన్. మహిళలకు ప్రాధాన్యం ఇవ్వటంతో పాటు లింగ వివక్ష రూపుమాపటం కోసం మెట్రో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రపంచంలోని 200 మెట్రోలో ఏ మెట్రో కూడా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేపట్టడం లేదు. మహిళలు, పిల్లలు, వృద్ధులు, దివ్యాంగులు సౌకర్యంగా జీవించే విధంగా సిటిని రూపుదిద్దాలన్న సీఎం కేసీఆర్ సంకల్పంలో మెట్రో తన వంతు కృషి చేస్తోంది. తరుణి మధురానగర్ స్టేషన్ లోని రెండెకరాల సంస్థలో శనివారం నుంచి ఎగ్జిబిషన్ ప్రారంభం కానుంది. రెండు నెలల పాటు కొనసాగే ఎగ్జిబిషన్ లో మహిళలు, పిల్లలు, పెద్దలు సహా అన్ని వయసుల వారు సేద తీరే విధంగా ఏర్పాట్లు చేశాం. ఇప్పటి జనరేషన్ పిల్లలకు పాతతరం జీవన విధానం, పల్లె వాతావారణం, సంస్కృతిని తెలిపే విధంగా గ్రామీణ వాతావరణాన్ని ఏర్పాటు చేస్తున్నాం. దాదాపు 150 స్టాల్స్ ను సిద్ధం చేశాం. అన్ని స్టాల్స్ బుక్ అయ్యాయి. మెప్మాకు 50 స్టాల్స్ కేటాయించాం. మహిళలకు కావాల్సిన అన్ని రకాల వస్తువులు ఎగ్జిబిషన్ లో ఉంటాయి. సెక్యూరిటీ పరంగా దాదాపు 60 కెమెరాలను ఏర్పాటు చేశాం. అగ్ని ప్రమాదాలు జరగకుండా దుకాణాల వరసలో ఫైర్ సేఫ్టీతో నీళ్లను అందుబాటులో ఉంచాం. రెండు నెలల పాటు రోజు సాయంత్రం ఐదున్నర గంటల నుంచి రాత్రి పదిన్నర గంటల వరకు ఎగ్జిబిషన్ ఉంటుంది. ప్రవేశం ఉచితం.

**పిల్లల కోసం ఆట వస్తువులు**

పిల్లలు ఉల్లాసంగా గడిపేందుకు ప్రత్యేకంగా జాయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్, ఇతర ఆట వస్తువులను ప్రత్యేకంగా ఏర్పాటు చేశాం. నేషనల్ అకాడమీ సెంటర్ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్ మెంట్ ట్రైనింగ్ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తున్నాం. విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి. అదే విధంగా యోగా శిక్షణ ఇచ్చేందుకు పలు సంస్థలు ముందుకొచ్చాయి. రోజు ఉదయం గంట సేపు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలుంటాయి.

**సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు**

తరుణి ఫెయిర్ లో భాగంగా రాష్ట్ర సాంస్కృతిక శాఖ ప్రత్యేకంగా కార్యక్రమాలు నిర్వహించనుంది. ప్రతి రోజు సాయంత్రం ఆరు గంటల నుంచి 8 వరకు ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు సాంస్కృతిక శాఖ ప్రతినిధి మామిడి హరికృష్ణ తెలిపారు. తరుణి తరంగం పేరుతో తెలంగాణ జానపదాలు, శాస్త్రీయ నృత్యం, గిరిజన నృత్యాలు తెలిపే విధంగా రెండు నెలల పాటు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. 1500 కళాకారులు ప్రదర్శనలు ఇవ్వనున్నట్లు చెప్పారు. మెట్రో రైలు అధికారులతో కలిపి సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టడం ఆనందంగా ఉందన్నారు.

